విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 29 ఆగస్టు 2025   8 పేజీలు

ఏలూరు

భీమవరం

అమలాపురం

బషీర్‌బాగ్ స్ఫూర్తితో మరో ఉద్యమం

వామపక్ష, ప్రజా సంఘాల ఐక్యవేదిక

విశాలాంధ్ర-ఏలూరు/భీమవరం/అమలాపురం/రాజమండ్రి/కాకినాడ/రామచంద్రపురం: నాడు బషీర్‌బాగ్ ఘటన స్ఫూర్తితో నేడు మరో విద్యుత్ ఉద్యమం చేయక తప్పదని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమంలో కాల్పులకు బలైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలకు గురువారం వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల్లో నివాళులర్పించారు. ఏలూరు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన,ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ నాయకులు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఐఎఫ్‌టియు కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ. రవి. ఎం సిపిఐ (యు) ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు మాట్లాడుతూ నాడు చంద్రబాబు ప్రజలపై భారాలు మోపుతూ పెంచిన విద్యుత్ చార్జీలను బేషరతుగా రద్దు చేయాలని 2000 సంవత్సరం ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో చేపట్టిన ధర్నా సందర్భంగా ప్రభుత్వం భాష్ప వాయువులతో, తుపాకి గుళ్ళతో, గుర్రాలతో పాశవికంగా మూకుమ్మడి దాడి చేయించి ముగ్గురిని తుపాకీ గుళ్ళకు బలి తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వేలాది మంది ప్రజలు తీవ్రమైన గాయాల పాలయ్యారన్నారు. కార్పొరేట్ శక్తుల కోసమే బాబు సర్కార్ పనిచేస్తున్నది అనడానికి నేడు అదాని స్మార్ట్ మీటర్లను ప్రజల ఇండ్లకు, షాపులకు,శర వేగంగా బిగిస్తున్నారని అన్నారు. అదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో బషీర్‌బాగ్ ఉద్యమ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరు హేమ శంకర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు, సిఐటియు పంపన రవికుమార్ , పిఓపి జిల్లా నాయకులు విద్యుత్ అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పిస్తూవారి ఆశయ సాధన కోసం ప్రతిజ్ఞ పత్రాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, మావూరి విజయ, గొర్లి స్వాతి, అన్నవరం, ▶మిగతా 4లో..

రామచంద్రపురంలో

రాజమండ్రి

తమ్మిలేరులో పెరుగుతున్న నీటిమట్టం

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరు వద్ద తమ్మిలేరులోకి వచ్చి చేరుతున్న వరద నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గురువారం తమ్మిలేరు నీటిమట్టం మామూలు స్థితిలో ఉంది. సాయంత్రానికి వరద నీటి ప్రవాహం ఎక్కువైంది. ఈ వరద నీటి వలన ఏలూరు నగరానికి ప్రమాదం లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఏలూరు తూర్పులాకులు ,పడమటి లాకుల వద్ద గేట్లను ఎత్తివేసి వరద నీటిని క్రిందికి వదులుతున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వలన ▶మిగతా 2లో..

డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

- మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్రప్రతినిధి-ఏలూరు: జిల్లాలో డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడం ద్వారా మహిళల సాధికారతకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వార్షిక రుణ ప్రణాళిక, డ్వాక్రా సంఘాల జీవనోపాధుల కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉన్నదని, ముఖ్యంగా ఉద్యానవనాలు, మత్స్య శాఖల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటులో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లాలోని 41,525 స్వయం సహాయక సంఘాలకు గాను 39,396 సంఘాలు రూ.1688 కోట్లతో సూక్ష్మ రుణ ప్రణాళికలు అందించారని తెలిపారు. వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, వారు దరఖాస్తు చేసిన స్వయం ఉపాధి యూనిట్లు వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో డ్వాక్రా సంఘాల మహిళలతో ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటుచేసి, పాడి పశువుల కొనుగోలు, గొర్రెలు, మేకలు కొనుగోలుకు, ఆక్వా రంగంలో ప్రాసెసింగ్ ▶మిగతా 2లో..

నీటిలో పాఠశాల

విశాలాంధ్ర-లింగపాలెం: కలరాయనగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీటిలో మునిగింది. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాఠశాల స్థలమంతా జలమయం అయ్యింది. వర్షాలు పడితే ఈ పాఠశాల పరిస్థితి ఇంతే. 20 ఏళ్ల క్రితం ఈ పాఠశాలను హడావుడిగా ▶మిగతా 2లో..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

–ఇరువురి పరిస్థితి విషమం
–ముగ్గురికి స్వల్ప గాయాలు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మూలపేట గ్రామంలో ఆరుగురు యువకులు బుధవారం విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. ఏడిద చరణ్(19) మృతి చెందగా వల్లూరి నగేష్(27), మడికి నిఖిల్ (18) పరిస్థితి విషమంగా ఉండగా విష్ణు, రాజు, తేజ స్వల్ప గాయాలతో బయట పడినట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం ఉదయం వాలీబాల్ ఆడుకునేందుకు స్తంభాలు నిలబెడుతున్న తరుణంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. గాయాల పాలైన యువకులను తొలుత పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి ▶మిగతా 2లో..

తెలుగు పరిరక్షణ అందరి బాధ్యత

నేడు తెలుగు భాష జయంతి

విశాలాంధ్ర - ఉంగుటూరు : తెలుగు భాషా సాహిత్యాల బహుముఖ వికాసం, పరిరక్షణ తెలుగువారందరి బాధ్యత అని, అందుకు అందరూ పూనుకోవాలని విద్యావేత్త, తెలుగు పండి తుడు డాక్టర్ జటావల్లభుల సాయి రామ్ అన్నారు. ఆగస్టు 29 గిడుగు రామమూర్తి 163వ జయంతి సందర్భంగా సాయి రామ్ తెలుగు భాషా సాహిత్య వైభవం, పరిరక్షణ అంశాలపై ముచ్చటించారు. తెలుగు సాహిత్యాన్ని విభిన్న ప్రక్రియల్లో మహాకవులు ఆవిష్కరించారని, వాటిని అధ్యయనం చేసి నూతన ఆవిష్కరణలు అందించాలని పిలుపునిచ్చారు. తెలుగులో ఉత్తమ పరిశోధనలకు తగిన గుర్తింపు, జానపద కళా రూపాలకు, ప్రోత్సాహం, రంగ స్థల నాటకాలకి ఆదరణ అవసరమని, సాయిరామ్ అన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణాల పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: డ్వాక్రా మహిళలు కష్టపడి వ్యాపార అభివృద్ధి చేయాలని దానికి ఎల్లప్పుడూ బ్యాంకులు రుణాలు ఇస్తాయని యూకో బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్, ఏ జీ ఎం ప్రశాంత్ కుమార్ అన్నారు. గురువారం గణపవరం మండలం మొయ్యేరు, కోమద్రు గ్రామాలకు చెందిన 16 స్వయం సహాయక సంఘాలకు అత్తిలి యూకో బ్యాంకు సారథ్యంలో మూడుకోట్ల ఐదు లక్షల రూపాయలు సంఘ సభ్యులకు రుణ ప్రణాళికల ఆధారంగా రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. యూకో బ్యాంక్ అత్తిలి బ్రాంచి, మొయ్యేరు, రైతు సేవా కేంద్రంలో మెగా ఎస్ హెచ్ జి క్రెడిట్ క్యాంపు ఏర్పాటు చేసి మహిళల కు చెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దూళ్ళ కుటుంబరావు, ఏఎంసి డైరెక్టర్ కె ప్రసాద్, మొయ్యేరు సొసైటీ ప్రెసిడెంట్ కానుమిల్లి వెంకటేశ్వరరావు (చంటి), యూకో బ్యాంక్ చీఫ్ మేనేజర్ సుదీప్తా మిత్రా, బ్రాంచ్ మేనేజర్ సురేష్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ ఎం. రోహిత్, ఏపీఎం ఎస్ ఎస్ అమీరున్నిసా , సీసీలు, వివో ఏలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యువత హెచ్ఐవి బారిన పడవద్దు

విశాలాంధ్ర-ముదినేపల్లి : యువత హెచ్ఐవి బారిన పడకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంఎల్ హెచ్ పి ఎం. జ్యోతి అన్నారు. ముదినేపల్లి మండలం దాకరం గ్రామంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ , చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ టీం సంయుక్తంగా నిర్వహించిన ఇంటింటి కార్యక్రమంలో కరపత్రాలను అంద జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడి లున్నా మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. హెచ్ఐవి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫ్లెక్సీలు, ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహనపర్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ నాగలక్ష్మి, టి.చంద్రావతి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

బలోపేతం చేయాలి (1వ పేజీ తరువాయి)

యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ పీడీ ఆర్.విజయరాజు,వ్యవసాయాధికారి హబీబ్ భాష, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రామ్మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు,పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ గోవిందరాజులు, నాబార్డు ఏజీఎం అనిల్ కాంత్, ఎల్డీఎం నీలాద్రి, ప్రభృతులు పాల్గొన్నారు.

మోడల్ మండలంగా అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో అధికారులు ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, దాని ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో బీవీ అప్పారావు ఆధ్వర్యంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాతలు హాజరయ్యారు. తొలుత శాఖల వారీ సమీక్ష నిర్వహిం చిన అనంతరం రాజ్యసభ సభ్యుడు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా వీరవాసరం మండలాన్ని మోడల్ మండలంగా అభివృద్ధి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కమిటీగా ఏర్పడి బ్లూప్రింట్ తయారు చేయాలని సూచిం చారు. ఏడాదిలో మండల అభివృద్ధికి కావాల్సిన బ్లూప్రింట్ తయారు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మంత్రుల వద్దకు వాటిని తీసుకువెళ్లి

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు నిధులు సమీకరించే అవకాశం ఏర్పడుతుంద న్నారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని మాట్లాడుతూ మండల అభివృద్ధికి తయారు చేసే బ్లూప్రింట్ కమిటీ చైర్మన్ గా రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ ఉండాలని కోరారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు పాకా, భీమవరం ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాతలను ఎంపీటీసీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. సమావేశంలో తహసీల్దార్ ఏవీ.రామాంజ నేయులు, ఉప ఎంపీపీ అడ్డాల రామ, సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ. కమిటీ అధ్యక్షుడు ఆకుల లీలాకృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రోమోర్ ఎరువుల షాపులు తనిఖీ

విశాలాంధ్ర- ఉంగుటూరు : మండల కేంద్రమైన ఉంగుటూరు లో ఉన్న మన గ్రోమోర్ ఎరువుల షాప్ ను జిల్లా వ్యవసాయం అధికారి హబీబ్ భాష గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలు సక్రంగా జరుగుతున్నాయా లేదని ఆయన రికార్డులను పరిశీలించారు. యూరియా సరఫరా, నిల్వలు అమ్మకాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూరియా వ్యవసాయ రైతులకు మాత్రమే ఇవ్వాలని, వ్యవసాయేతర అవసరాలకు

ఇవ్వకూడదు జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు. అమ్మకాలు ప్రతిరోజూ ఈపాస్ లో నమోదు చేసి మాత్రమే రైతులకు అమ్మాలని సూచించారు. ఈ తనిఖీ లో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతి (1వ పేజీ తరువాయి)

పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యుత్ షాక్తో మృతి చెందిన ఏడిద చరణ్, గాయాల పాలైన యువకుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడంతో మూలపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం : మూలపేట గ్రామంలో బుధవారం మృతి చెందిన ఏడిద చరణ్(19) కుటుంబ సభ్యులకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు సురక్ష హాస్పిటల్ అధినేత జ్యోతుల శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటిలో పాఠశాల (1వ పేజీ తరువాయి)

చెరువు స్థలంలో నిర్మించారు. భవిష్యత్తు ఆలోచన లేకుండా విద్యార్థుల, ఉపాధ్యాయుల పరిస్థితి ఎలాఉంటే మాకేంటిలే పాఠశాలకు భవనాన్ని నిర్మించాములే అన్నట్లుగా దీన్ని నిర్మించారు. ముందుచూపు లేకుండా నిర్మించడం వల్ల ఇప్పుడు అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడితే గ్రౌండ్లో నీరు నిలుస్తుంది.వచ్చిన నీరు బయటకు వెళ్లేందుకు సరైన చర్యలులేవు. గ్రౌండ్లోకి నీరు వస్తే నీటిలోనే తరగతి గదుల్లోకి వెళ్లాల్సి వస్తుంది. ఈఅవస్థలు ఎందుకులే అన్నట్లు విద్యార్థులు బడికి రావడమే మానేస్తున్నారు. ఈ పరిస్థితి చూసి తల్లిదండ్రులు సైతం పిల్లల్ని బడికి పంపడం లేదు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా కలిసి గ్రౌండ్లో నీరునిల్వ లేకుండా ఉండేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నా అంతగా ఫలించటం లేదు. అధికారులు పర్మినెంట్గా గ్రౌండ్ లోకి వచ్చిన నీటిని బయటికి వెళ్లే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పాఠశాలను ఆనుకొని చెరువు ఉంది. పడిన వర్షపు నీరు గ్రౌండ్ లోనే ఉంటుంది.వర్షాలు పడిన సమయంలో విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. గ్రౌండ్లో పడిన వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెంటనే బయటికి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ ఉండటం వల్ల స్థలం ఉన్నా ఉపయోగం లేదని విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు,ప్రజలు వాపోతున్నారు.

నీటిమట్టం (1వ పేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం, పెదవేగి,ముసునూరు మండలాల్లోని ఏరులు, వాగులు, వంకలు, కాలువలతోపాటు లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీరు తమ్మిలేరులోకి వచ్చి చేరుతోంది. దీనివలన ఏలూరు వద్ద తమ్మిలేరు నీటిమట్టం పెరిగింది. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గల బ్రిడ్జి వద్ద వరద నీటి ప్రవాహానికి అడ్డంగా గుర్రపుడెక్క చేరడంతో జెసిబి ద్వారా దాన్ని తొలగిస్తున్నారు. హనుమాన్ నగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి వరద నీటికి మునిగిపోయింది. దీన్ని మున్సిపల్ శాఖ అధికారులు మోటార్ల ద్వారా తోడి తమ్మిలేరులోకి పంపిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇరిగేషన్ చానల్స్ నీటిమట్టం మామూలు స్థితిలోనే ఉన్నాయని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

తమ్మిలేరులోకి వస్తున్నది కేవలం పరిసర ప్రాంతాలలోని మండలాల్లో కురిసిన వర్షం నీరు మాత్రమేనని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

వర్షాలతో జనజీవనం స్తంభన

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతంలో ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. వరుసగా నాలుగు రోజుల నుంచి వర్షాలు పడటంతో వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. వ్యవసాయ కూలీలు పనులే కాక ఇతర పనులులేక ఇబ్బందులు పడుతున్నారు. లింగపాలెం మండలంలో పడుతున్న వర్షాలకు చెరువులన్నీ నీటితో నిండాయి. దెబ్బతిన్న రహదారులలో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. రహదారులలో నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ధర్మాజీ గూడెంలోని అనన్య పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రెండు చోట్ల రాకపోకలు సజావుగా సాగటం లేదు. మండలంలోని గ్రామాలలోకి వెళ్లే పలు లింకు రహదారులన్నీ వర్షాలు వల్ల దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. లింగపాలెం మండలంలో నాలుగు రోజుల నుంచి దాదాపు 110 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తహసిల్దార్ నజీముల్లాషా తగిన జాగ్రత్తలు చేపట్టారు. రెవెన్యూ ఉద్యోగులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

నాన్న ఆవేదన చూసి డాక్టర్ అవ్వాలనుకున్నా

కష్టానికి ఫలితం పొందాను : అక్షయ్

విశాలాంధ్ర- లింగంపాలెం : ధర్మాజీగూడెంకు చెందిన సొంగా అక్షయ్ నీట్ లో ర్యాంకు సాధించి ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా ఈ వైద్య విద్యార్థి తన అనుభవాలను విశాలాంధ్రతో పంచుకున్నాడు. మా నానమ్మకు క్యాన్సర్ వ్యాధి సోకింది. మా నాన్న ఆమెకు ఒక్కడే కొడుకు. నానమ్మను బ్రతికించుకోవడం కోసం నాన్న పడిన కష్టం అంతాఇంతా కాదట. ఆ సమయంలో మానాన్నకు ఉద్యోగం లేదు. పేదరికంతో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులవల్ల అమ్మను బతికించుకోవడం కోసం మా నాన్న పడిన కష్టాలు చెపుతుంటే చలించి పోయా. పేదరికం వల్ల మా అమ్మను బతికించుకో లేకపోయానని నిత్యం నాన్న ఆవేదనకు గురవుతూ ఉంటాడు. అది చూసి తాను డాక్టర్నయి పేదలకు సేవలు అందించాలనే ఆలోచన చిన్ననాడే కలిగింది. ఈఆశయంతో కష్టపడి చదివాను.టెన్త్, ఇంటర్లో 90 శాతం మార్కులు సాధించాను. డాక్టర్ చదవాలనే తన ఆలోచనకు అమ్మ, నాన్న ఎంతగానో ప్రోత్సహించారు. నీట్ ఎంట్రన్స్ లో రాష్ట్రవ్యాప్తంగా 4,997 ర్యాంకు సాధించాను. దీంతో ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించా. తన ఆశయానికి ఇది తొలి అడుగుగా భావిస్తున్నా. వైద్యశాస్త్రంలో ఉన్నత స్థాయిని అందుకోవాలని తన ఆశయం. క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థిగా పేరున్న అక్షయ్ కు మెడికల్ సీట్ రావటం పట్ల గ్రామ ప్రజలు అభినందిస్తు న్నారు. అక్షయ్ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని స్థానికులు ఆశిస్తున్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది

దాకే యేసేబు, తండ్రి దాకే యేసు రత్నం అను నేను ఆంధ్రప్రదేశ్ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ మార్చి 2021 సం॥లో పాస్ అయి ఉన్నాను. గణపవరం చాణక్య జూని యర్ కళాశాలలో చదివాను. ఇంటర్మీడియట్ హాల్ టికెట్ నెంబర్: 2104244725. ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ ఓ బ్యాగ్లో పెట్టుకుని ది.13-08-2025వ తేదీన ఇంటివద్ద నుండి గణపవరం జిరాక్స్ తీయడానికి వెళ్తుంటే మార్గ మధ్యంలో ఒరిజినల్ సర్టిఫికెట్ పడిపోయినది. దొరికిన వారు నా అడ్రస్కు అందజేయగలరు.

దాకే యేసేబు, క్రొవ్విడి గ్రామం
నిడమర్రు మండలం, ప.గో.జిల్లా
సెల్: 917893708710

ఫేజ్-3 ప్రభుత్వ భూముల రీసర్వే పకడ్బందీగా చేయాలి

జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: ఫేజ్-3 లో ప్రభుత్వ భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, 65 ఏళ్లు పైబడిన వయోవృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ అందిం చాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశిం చారు. జాయింట్ కలెక్టర్ భీమవరం మండలం

అనాకోడేరు, ఎల్.జి పాడు గ్రామాల్లో గురువారం ఫేజ్-3 లో ప్రభుత్వ భూముల రీ సర్వే ప్రక్రియ ఏ విధంగా జరుగుచున్నది పరిశీలించారు. ల్యాండ్ రికార్డుకు సంబంధించి వీఆర్వోలు అడంగల్లలో మార్పులు, చేర్పులు ఉంటే ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిరాయితి భూముల సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అనాకోడేరు పంచాయితీ ఈలంపూడి గ్రామంలోని 48 నెంబర్ రేషన్ షాపును తనిఖీ చేసి సరుకు వివరాలను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రతి నెల 26వ తేదీ నుండి 65 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులకు, దివ్యాంగు లకు వారి ఇంటి వద్దనే రేషన్ అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంలో భీమ వరం ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, డీఎస్ఓ సరోజ, మండల సర్వేయర్ ప్రవీణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడు ప్రజల విఘ్నాలు తొలగించి విజయాలు ప్రసాదించాలి

మేయర్ నూర్జహాన్

విశాలాంధ్ర- ఏలూరు : విఘ్నేశ్వరుడి దయతో ప్రజలందరికీ విఘ్నాలు తొలగి విజయాలు సాధించాలని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు కోరారు. వినాయక చవితి

సందర్భంగా 100 సంవత్సరముల చరిత్ర కలిగిన స్థానిక పవర్ పేటలో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో విజయ గణపతి మహోత్సవాల రెండవ రోజైన గురువారం శ్రీ విఘ్నేశ్వర స్వామికి మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్. పెదబాబు దంపతులచే పండితులు కందుకూరి త్రినాథ్ శర్మ, కందుకూరి విజయ్, కందుకూరి శబ రీష్ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకము నిర్వహించి మేయర్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ గత 20 సంవత్స రాలుగా వినాయక చవితి సందర్భంగా స్వామికి ఏకాదశ రుద్రాభి షేకం నిర్వహిస్తున్నామ న్నారు. భక్తులందరికీ విఘ్నాలు తొలగి విజయాలు సాధించాలని స్వామి ఆశీర్వదించాలని వేడుకున్నామని మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వాసు, శీర్ల శ్రీనివాస్ మేయర్ నూర్జహాన్ పెద బాబు దంపతు లకు శాలువా కప్పి విగ్నేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

కలెక్టరేట్‌ను ఎలా తరలిస్తారు?

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

విశాలాంధ్ర -భీమవరం: బలవంతంగా కలెక్టరేట్ ను భీమవరం నుండి ఉండికి తీసుకువెళ్తారా.. భీమవరంలో స్థలం లేదని ఎవరు చెప్పారు..కలెక్టరేట్ కట్టడానికి ప్రభుత్వం వద్ద డబ్బు లేదా.... అనవసర సమస్యలను సృష్టించకండని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు హితవు పలికారు. గురువారం ఆయన భీమవరంలోని తన క్యాంపు కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టరేట్ తరలింపుపై కూటమి నాయకుల్ని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమ వరంలో నిర్మించవలసిన కలెక్టరేట్కు సంబంధించి కూటమి ప్రజాప్రతినిధులు అనవసరంగా ప్రజల మధ్య వివాదాలు సృష్టించటానికి కారకులు అవుతున్నారని విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు భౌగోళికంగా మధ్యలో, అన్ని శాసనసభ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్న జిల్లా కేంద్రం భీమవరంలో కలెక్టో ంట్ను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. 2023లో భీమవరం అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో 20 ఎకరాల్లో నిర్మించడానికి అనాటి వై.యస్.ఆర్ ప్రభుత్వం 124 జీవోను విడుదల చేసింద న్నారు. ఆ జీవో సజీవంగా ఉండగా ఉండి నియోజకవర్గంలో కలెక్టరేట్ నిర్మించడానికి ప్రయత్నాలు చేయడం ఏమిటని మోషేన్ రాజు ప్రశ్నించారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో పలుచోట్ల కలెక్టరేట్ నిర్మాణాలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు. భీమవరంలో కలెక్టరేట్ నిర్మించడానికి కూటమి నేతలు, ప్రభుత్వం సహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాల్యవివాహాల నిరోధానికి అందరూ సహకరించాలి

జడ్జి రత్నం ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర - ఏలూరు : బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అమీనాపేట లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును నిర్వహిం చారు. ఈ సందర్భంగా కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాల న్నారు. బాల బాలికలు తమ తోటి విద్యార్థులు పాఠశాలకు లేదా కళాశాలకు గైర్హాజరైన సమయంలో వివరాలను తెలుసుకొని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాల్య వివాహాల విషయం ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే 1098 లేదా 15100లకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. విద్యార్థి దశలో వివాహాలు నిర్వహిస్తే బాలికల ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తు దెబ్బతింటుందని హితవు పలికారు. వివాహ వయసు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు జరిపించాలని, అప్పుడే పుట్టబోయే బిడ్డలు

ఆరోగ్యవంతంగా ఉంటారని తెలియచేశారు. బాల్య వివాహాలు ఇష్టంలేని బాల బాలికలను ప్రభుత్వం వసతి గృహాలలో చేర్చి సంస్థలు పునరావాసం కల్పించి వారికి విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందని, అందువల్ల బాల బాలికలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని భవి ష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పానల్ న్యాయవాది పి. వెంకటేశ్వరరావు, వసతి గృహ వార్డెన్ రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో మంత్రి సారధి చొరవతో సహాయక చర్యలు

విశాలాంధ్ర-నూజివీడు : ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నూజివీడు పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన ఎన్టీ ఆర్ కాలనీ, ఎంఆర్ అప్పారావు కాలనీ, పోతిరెడ్డి పల్లి అడ్డరోడ్లలో నీట మునిగి ప్రజలు పడుతున్న ఇబ్బం

దులు మంత్రి సారధి దృష్టికి రావడంతో ఆయన ఆదేశాలతో అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఎక్కడికక్కడ నిలిచిపోతున్న నీటిని తొలగిస్తూ సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ కాలనీలో భారీ వర్షాల కారణంగా కొన్ని ఇళ్లలో నీరు చేరి ప్రజలు ఎటూ కదలలేని పరిస్థితిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు మంత్రి సారధి సిబ్బంది చేయూతనందించారు. పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు ఆగమేఘాలపై జేసీబీతో మురుగు కాలువల్లో చెత్త, మురుగు తొలగించి వర్షపు నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్ర మంలో మంత్రి ఓఎస్డి ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యునిగా కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యునిగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఎన్నికయ్యారు. ఇటీవల ఒంగోలులో మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ 28 వ రాష్ట్ర మహాసభల్లో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యునిగా తాను ఎన్నికైనట్టు భీమారావు చెప్పారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల

పరిష్కారానికి నిర్విరామంగా పోరాడాలని పార్టీ రాష్ట్ర మహాసభల్లో పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజల తలమానికం విశాఖ ఉక్కు పరిరక్షణకు, పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి స్థలా లిచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించాలని కోరుతూ ఉద్యమించడంతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 62 తీర్మానాలను మహాసభలో చర్చించి ఆమోదించినట్టు భీమారావు చెప్పారు.

వినాయకుని విగ్రహానికి వెండి కవచం బహూకరణ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెం పట్టణంలో ప్రధాన రహదారిని ఆనుకుని వేంచేసి ఉన్న శ్రీశ్రీ వర సిద్ధి వినాయకు నికి ఆరు లక్షల రూపాయల విలువ గల వెండి కవచాన్ని పట్టణా నికి చెందిన సంకు వారి కుటుంబం వినాయక

చవితి సందర్భంగా బహూకరించారు. గ్రామంలో పురవీధులలో కేరళ డప్పు డాన్సులతో గ్రామంలో ఉన్న ప్రతి ఆలయాన్ని సందర్శించి, ఊరేగింపుగా ఆలయం వద్దకు సంకు వారి కుటుంబాలు అంతా కలిసి వినాయకుని వెండి కవచాన్ని తీసుకువచ్చి ఆలయ కమిటీ అధ్యక్షుడు మట్ట సూర్య చంద్రరావుకు, కమిటీ సభ్యులకు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంకు మధు, సంకు కొండలరావు, సంకు కృష్ణ, సంకు శ్రీను, వారి కుటుంబ సభ్యులు అంతా మహిళలతో చిన్నారులతో పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని మేడిపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ఎరువులను రైతులకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. యూరియా, డి ఏ పి ఎరువులను పలు గ్రామాల రైతులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా జనసేన, బిజెపి మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, గణేశుల ఆదినారాయణ, వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు యాళ్ళ శంకరం, బుడిబుడ సురేష్, నయీమ్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన విఆర్ఓ కుటుంబానికి న్యాయం చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - వేలేరుపాడు : వి ఆర్ పురం మండలంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన విఆర్ఓ మనోజ్ కుమార్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మండలంలోని ఉదయ నగర్ కు చెందిన మనోజ్ కుటుంబ సభ్యులు భార్య భారతి, కుమారుడు రాహుల్ కూతురు చరిష్మాలను సీపీఐ నాయకులు కలిసి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గత వారం రోజులుగా ఆయనకు తీవ్రమైన జ్వరం వస్తున్నా విధులు నిర్వహించాలని ఆదేశించడం చాలా దారుణమన్నారు. గోదావరి వరదల కారణంగా అనారోగ్యంగా ఉన్నా కూడా విధులు నిర్వహించాలని అధికారులు ఆదేశించడం వలన ఆయన సచివాలయంలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. ఆ క్రమంలో ఈనెల 22 రాత్రి తీవ్రమైన జ్వరం పెరగటంతో పాటు ఫిట్స్ రావడంతో ఆయన చనిపోయారని తెలిపారు. సరైన సమయంలో వైద్యం చేయించడానికి ఎవరు అందుబాటులో లేకపోవడం వలన కుటుంబం ఆ వ్యక్తిని

కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సీపీఐ సీనియర్ నాయకులు ఎండి మునీర్,జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, సన్నేపల్లి సాయి బాబా, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మడివి కామయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, వెంకటేశ్వరావు తదితరులు మనోజ్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా నిస్తూ తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మరో ఉద్యమం

(1వ పేజీ తరువాయి)

కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మీ, భవాని, ఎం ఏ హకీమ్, సూరిబాబు, బేత శంకర్,సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డివిఎస్వీ ప్రసాద్,కనకరావు,పీవీ రామకృష్ణ,కే శ్రీనివాస్,జే గోపీ, ఎ. శ్యామల రాణి,అరుణ్ కుమార్,ప్రసాద్, లెనిన్, వెంకటేశ్వరరావు, మంగరాజు రాము, నవుడు నెహ్రూ బాబు, తమ్మిశెట్టి రమణయ్య, దాచేపల్లి ఆదినారాయణ, వర్మ,చంద్రశేఖర్, మీసాల వెంకటరమణ, తాతారావు, దుర్గారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు బిగింపు, ట్రూ అప్ ఛార్జీలు విరమించుకోకపోతే మరో బషీర్ బాగ్ ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరామ్ కూటమి సర్కారును హెచ్చరించారు. వామపక్షాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిలకు భీమవరం ప్రకాశం చౌక్ వద్ద నివాళులర్పించి విద్యుత్తు చార్జీలు పెంపు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామంటూ వామపక్ష నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కోనాల, బలరామ్ మాట్లాడుతూ నాడు తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్తు ఉద్యమం సాగించడన్నారు. ఆ ఉద్యమంపై ఉక్కు పాదం మోపిన ఘటనలో ముగ్గురు అమరులయ్యారని, వేలాదిమంది గాయపడ్డారని గుర్తు చేశారు. విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఎం సీపీఐ నాయకులు జి.రాంబాబు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు డి.శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, రూరల్ కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, నాయకులు కిలారి మల్లేశ్వరరావు, వై.వి.ఆనంద్, తిరుమాని కామేశ్వరరావు, ఎం.లక్ష్మీపతి , ఖాన్ భాష, ఎంసిపిఐ నాయకులు కె.మహంకాళి, సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, జక్కం శెట్టి సత్యనారాయణ, మామిడి శెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠ రావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం.అంజనేయులు, డి.త్రిమూర్తులు, దేగల నాగేశ్వరరావు, బొక్క సత్యనారాయణ, కలిదిండిసత్యనారాయణ, రఫాయేలు, కే.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం : అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో విద్యుత్ పోరాటాలలో అమరులైన కామ్రేడ్ రామకృష్ణ, కామ్రేడ్ బాలస్వామి, కామ్రేడ్ విష్ణువర్ధన్ రెడ్డిలకు సిపిఐ, సిపిఎం వామపక్షాల ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారికి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 2000వ సంవత్సరం ఆగస్టు 28వ తేదీన కరెంట్ చార్జీల పెంపుదలకు నిరసనగా హైదరాబాద్‌లోని బషీర్ భాగ్‌లో విద్యుత్ ఉద్యమ కారులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి ముగ్గురు మరణానికి చంద్రబాబు నాయుడు కారణమయ్యాడన్నారు. వారి ప్రాణ త్యాగాలను స్మరించుకుని వారి స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపట్టవలసి వస్తుందన్నారు. పెంచిన ఉద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ట్రూ అప్ చార్జీలను రద్దుచేయాలని ఆయన అన్నారు. సిపిఎం కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను తగ్గించాలని, లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల వెంకటరమణ, చెల్లుబోయిన తాతారావు, పుల్లెల ఆనంద్, సరేళ్ళ శివ, వి చిట్టిబాబు, సిపిఎం నాయకులు దుర్గాప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో :2000 ఆగస్టు 28న విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో అమరవీరులకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ నాయకులు పెద్దిరెడ్డి రాము, సిపిఎం నాయకులు సూకల బలరాం, సిపిఐ ఎంఎల్ నాయకులు వి. భీమశంకరం, సిపిఐ ఎంఎల్-2 నాయకులు జె. సత్తిబాబు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా 3నెలల ఉద్యమం బషీర్ బాగ్ కాల్పుల వరకూ సాగిందన్నారు. కరెంటు ఛార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు పలుమార్లు ఆలోచించేలా చేసిన చరిత్ర ఆ ఉద్యమానిదన్నారు. విద్యుత్ ఉద్యమంలో నాటి చంద్రబాబు ప్రభుత్వ తుపాకీ తూటాలకు ప్రాణాలిచ్చిన బషీర్ బాగ్ అమరులకు జోహార్లు అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు శారద, బాజీ, సిపిఎం నాయకులు కె. సత్తిబాబు, నాగరాజు, సిపిఐఎంఎల్ నాయకులు చింత రాజా, వానపల్లి నాగరాజు, కరిపోతు నవీన్, ఆటో నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు : 2000 సంవత్సరంలో ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ చార్జీలు పెంచిన చంద్రబాబు ప్రభుత్వ వైఖరికి నిరసనగా వామ పక్షాలు, కాంగ్రెస్ ఇచ్చిన పిలుపులో భాగంగా హైదరాబాద్ బషీర్బాగ్లో జరిగిన మారణకాండలో పోలీస్ కాల్పులలో మరణించిన అమరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాల స్వామిలకు నివాళులర్పిస్తూ గురువారం నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సిపిఐ,

సిపిఐ(ఎం), సిపిఐ ఎంఎల్ లిబరేషన్, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ ఆనాడు ప్రపంచ బ్యాంకు ఏజెంటుగా వ్యవహరించిన చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపారని పేర్కొన్నారు. ఆ విధానాన్ని ప్రజలు వ్యతిరేకించి పోరాటం నిర్వహిస్తే ప్రజలపై దమనకాండకు పాల్పడి ముగ్గురు ప్రాణాలు బలి తీసుకున్నారని అన్నారు. వందల మంది గాయపడ్డారని తెలిపారు. దానినుంచి గుణపాఠం తీసుకొని చంద్రబాబు పాతిక సంవత్సరాల తర్వాత తిరిగి ఇప్పుడు మళ్లీ ట్రూ అఫ్ చార్జీలు రద్దు చేస్తానని, స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విద్యుత్తు భారాలు మోపటంతో పాటు, స్మార్ట్ మీటర్లు బిగించి, ప్రీపెయిడ్ కార్డుల పేరుతో ప్రజలను దోపిడీ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబు విధానాలు మార్చుకోకపోతే ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు ఎన్నార్ హనుమాన్లు మాట్లాడుతూ చరిత్ర నుండి చంద్రబాబు గుణపాఠం నేర్చుకోవటం లేదని గతంలో జరిగిన బషీర్బాగ్ ఉద్యమ అనుభవాల నుండి ఆయన పాఠాలు నేర్చుకోవాలని లేకపోతే తగిన పరిహారం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు బక్కయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజు, సీపీఎం నాయకులు జి రాజు ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించి సభలో ప్రసంగించారు. ముందుగా విద్యుత్ అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి లకు సీపీఐ రాష్ట్ర నాయకులు చలసాని రామారావు పుష్పమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

కుక్కునూరు : ఆగస్టు 28వ తేదీ 2000లో బషీర్బాగ్ వద్ద విద్యుత్ చార్జీల మోతపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనకు దిగి పోలీసుల కాల్పుల్లో అమరులైన వీరులకు కుక్కునూరులో వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం ప్రతిజ్ఞ చేసి నివాళు లర్పించారు. అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి,బాలస్వామికి

స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జోహార్లు ప్రకటించి రెండు నిమిషాలు మౌనం వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడారు .విద్యుత్ చార్జీల పెంపు విషయంలో గత ప్రభుత్వాలు అవలంభించిన వైఖరినే కూటమి ప్రభుత్వం కూడా సాగిస్తూ ప్రజల నడ్డి విరుస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్,ట్రూ అప్ చార్జీలు,స్మార్ట్ మీటర్ల బిగింపు వంటి వ్యతిరేక విధానాలపై పోరాడటానికి ప్రతిజ్ఞ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కుక్కునూరు సహాయ కార్యదర్శి కూరాకుల బాబూరావు, సీపీఎం నాయకులు ఎస్కే వలీపాషా, వైసీపీ నాయకులు రాయి సత్యనారాయణ, మల్లేష్, కాంగ్రెస్ నాయకులు గజ్జి రాజులు, వడ్డే రఘు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి సన్నద్ధం కావాలని సిపిఐ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం పట్టణ సిపిఐ కార్యదర్శి మండల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం పట్టణంలో విద్యుత్ అమరవీరుల 25వ సంస్మరణ సభ జరిగింది. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభను ఉద్దేశించి కర్రి నాగేశ్వరరావు, మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ పోరాటం నిర్వహించి నేటికి 25 సంవత్సరాలు పూర్తయ్యిందని తెలిపారు. ఆనాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ సంస్కరణల భారాన్ని తీసుకొస్తే దానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీలు పెద్ద

ఎత్తున ఉద్యమం నిర్వహించాయని తెలిపారు. విద్యుత్ సంస్కరణ లకు వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్షాల కార్యకర్తలపై ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కాల్పులు జరిపించిందన్నారు. ఆ పోలీస్ కాల్పు ల్లో ముగ్గురు కార్యకర్తలు చనిపోయారని ఆయన వివరించారు. ఆనాడు నిర్వహించిన పోరాటం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు వేయడానికి ధైర్యం చేయలేదన్నారు. నేడు రాష్ట్రంలో స్మార్టుమీటర్లను బిగిస్తున్నారని, దీనివల్ల ప్రజలపై విద్యుత్ భారాలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. 2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటం సందర్భంగా అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రాణత్యాగాల స్ఫూర్తితో రానున్న కాలంలో రాష్ట్రంలో ప్రజలపై పెరుగుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి నాయకులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ప్రతివాద నాగేంద్ర, సాయి తదితరులు నాయకత్వం వహించారు.

వేలేరుపాడు : విద్యుత్ సంస్కరణలు వెంటనే రద్దుచేసి ప్రజలపై వేస్తున్న భారాలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ కూడలిలో నిరసన చేశారు. ముందుగా విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి 25వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి రాము

అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎండి మునీర్, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా మాస్ లైన్ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఆనాడు విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు బిజెపితో కుమ్మక్కై ప్రజలపై భారాలను మోపుతున్నదన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపునకు కూడా అనుమతులు ఇచ్చిందన్నారు. వెంటనే ఈ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎర్ర మధు, కురిమెళ్ళ వెంకటేశ్వరరావు, బుడిబుడి జానుబాబు మచ్చ చంద్రబాబు, సోడే కన్నారావు సోడే మారయ్య, నిమ్మల రాంబాబు, సరియం నాగులు, సోడే సీతారాముడు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ నాయకులు తోడం సీత, మద్దాల సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వలగాని సమ్మయ్య, ఎస్కెఇబ్రహీం, ఎస్కే సఫీ, మాచర్ల భీమయ్య, వెంకటస్వామి, ఆటో యూనియన్ నాయకులు కురిమెళ్ళ శ్రీను, కార్ డ్రైవర్లు యూనియన్ నాయకులు సూరం చంటి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల

కార్యదర్శి నెక్కంటి క్రాంతికుమార్ అన్నారు. నరసాపురం పట్టణంలో సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో విద్యుత్ ఉద్యమంలో అమరులకు నివాళులు అర్పించారు. దీనిలో భాగంగా పట్టణంలో పలు వీధుల్లో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయరావు, సానబోయిన ఫణిరాజు, సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28న బషీరాబాగ్‌లో చేపట్టిన అప్పటి విద్యుత్ ఉద్యమాలలో అవువులు బాసిన రామకృష్ణ,

బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలకు ఘన నివాళులు అర్పించినట్టు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టబోతుంటే నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటిపాలకపక్ష నేతలు స్మార్ట్ మీటర్లు పెడితే పగలకొట్టమని, మీటర్లు బిగించడానికి వచ్చిన వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారని, నేడు స్మార్ట్ మీటర్లు అమర్చి వినియోగదారులపై మోయలేని భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల అధ్యక్షుడు శుక్ల బోయిన రాంబాబు, సిపిఐ మండల సహాయక కార్యదర్శి లక్క లక్ష్మణరావు, బొబ్బర చిట్టిబాబు, రామకృష్ణ, రామారావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: బషీరాబాద్ విద్యుత్ అమరవీరుల త్యాగాలను మరువబోమని పలువురు ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. జీలుగుమిల్లి జగదాంబ సెంటర్లో వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకు నివాళు లర్పించారు. ఆదాని స్మార్ట్ మీటర్లను బిగించవద్దు అని, పెంచిన కరెంటు చార్జీలు, సర్‌చార్జీలు తగ్గించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు భూషణం, కారం దారయ్య, కట్టం ముత్యాలరావు మాట్లాడుతూ విద్యుత్ పోరాట అమరవీరులు కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి మరణించి నేటికి 25 సంవత్సరాలైందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారాలను మోపుతుందన్నారు. దీనిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం నాయకులు కట్టం నాగేశ్వరరావు, దోల నరసింహారావు, ఊకె వెంకటేశ్వరరావు, దాకారపు వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు, కొవ్వుల నాగరాజు, కరటం వెంకటేశ్వర్లు, శ్రీను సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు సోయం చంద్రరావు, సోడే విజయ్, కారం సత్యవతి, మడివి కన్నమ్మ, ఎంపిటిసి కట్టం రత్తమ్మ, సర్పంచ్ మామిడి గంగమ్మ సిపిఎం నాయకులు, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలి

బొరుసు సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర - కడియం : మండలం లోని కడియపులంక పంచాయతీకి పూర్తి స్థాయి బాధ్య తలు నిర్వర్తించేలా కార్యదర్శిని నియమించాలని, గత ఐదేళ్లుగా శాశ్వత కార్యదర్శి లేక అభివృద్ధిలో గ్రామం కుంటు పడుతోందని పంచాయతీ వార్డు సభ్యుడు బొరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. 2021 నుండి ఇప్పటివరకు సంవత్సరానికి ఇద్దరూ లేక ముగ్గురు ఇంచార్జ్ కార్య దర్శులను మారుస్తూ, కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు శిరీష, రాజశేఖర్, విజయరాజు, వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, సుస్మిత జోన్స్, శ్రీనివాసరావు తదితరులు గ్రామపంచాయతీ ఇన్చార్జి కార్యదర్శులు గా పనిచేశారన్నారు. పంచాయతీ పనులు చేపట్టాలన్నా, వాటిపురోగతి సాధించాలన్నా శాశ్వత పంచాయతీ కార్యదర్శి ని నియమించాలని ప్రభు త్వాన్ని కోరారు. ప్రభుత్వం తక్షణమే గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సెక్రటరీని నియమించాలని కోరారు. అలాగే గ్రామంలోని నాలుగు సచివాలయాల్లోను పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే ఈ ఖాళీలను భర్తీ చేసి గ్రామ అభివృద్ధికి దోహదపడాలని ఆయన కోరారు

పీఠాధిపతి పొలిమేర జయరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రంలో ఏలూరు పీఠాధి పతి పొలిమేర జయరావు జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నిర్మలగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ బొంబాయి విశ్రాంత అగ్ర పీఠాధిపతి కార్డినల్ ఓ స్వాల్డ్ గ్రేసియస్ కేకు కట్ చేసి పీఠాధిపతి పొలిమేర జయరావుకు అంద జేశారు. ఈ సందర్భంగా కార్డినల్ ఓ స్వార్డ్ గ్రేసియస్ పీఠాధిపతి పొలి మేర జయ రావును ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రంలో తన జన్మదిన వేడుకలు జరుపుకోవాలని గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ ఫాదర్ బాల ఇమ్మానుయేలు పొలు రాజా నిర్మలగిరి పుణ్యక్షేత్రం నిత్య అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు ఫాదర్లు పీఠాధిపతి పొలిమేర జయరావును అభినందించి సత్కరించారు నిర్మలగిరి క్షేత్రం విద్యార్థులు పీఠాధిపతి జయరావు పొలిమేర జన్మదినం సందర్భంగా చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంల ప్రిన్సిపాల్ స్వప్న సిస్టర్స్ ఫాదర్ మరియా జోషి అమ్మన రాజు అంతోని రాజు మైకెల్ స్టీఫెన్ ప్రేమ్ ఫాదర్లు సిస్టర్లు స్కూల్ విద్యార్థులు క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ విలేకరా ...అయితే ప్రొఫెషనల్ టాక్స్ కట్టండి

విశాలాంధ్ర - తాళ్లపూడి : సీనియర్ విలేకరా అయితే ప్రొఫె షనల్ టాక్స్ కట్టండి అని ఓ ప్రముఖ పత్రిక విలేఖరికి కమర్షి యల్ టాక్స్ ఆఫీస్ ఉద్యోగి వద్ద నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే ఆ విలేఖరి కి విస్మయం పొందిన పరిస్థితి ఎదురైంది. అసలే జీత భత్యాలు లేకుండా కేవలం హ్యానోరియం, లైన్ అకౌంట్ ల పై ఆధారపడి, జర్నలిజం పై కాంక్ష తో ఎంతో మంది ఏళ్ల తరబడి పాత్రికేయులుగా పనిచేస్తున్న పరిస్థితి నెలకొంది. కేవలం సేవా భావం తో పనిచేస్తున్న తమ సంక్షేమాన్ని చూడా లని ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, బస్, ట్రైన్ పాస్ లు ఇవ్వాలని ప్రభుత్వానికి ఏళ్ల తరబడి విన్నపాలు చేస్తున్న పాత్రికేయుల కు ప్రొఫెషనల్ టాక్స్ పేరుతో ప్రభుత్వం బాంబ్ పేల్చింది. ఐదేళ్ళ సీనియారిటీ దాటిన విలేకరులు అంతా వృత్తి పన్ను కట్టాలని నిబంధన పెట్టటం, వారికి సంబంధిత కమర్షియల్ టాక్స్ ఆఫీస్ నుంచి ఫోన్లు వెళ్లటం కాస్త గందర గోళం నెలకొంది. ఐదు సంవత్సరాల నుండి కనీసం అక్రిడేషన్ల మంజూరు కు సైతం అనేక నిబంధనలు పెట్టిన గత వై.కా.పా ప్రభుత్వాన్ని మించి ఎన్డీయే ప్రభుత్వం అక్రిడేషన్లు మంజూరు కు శ్రీకారం చుట్ట లేదు కానీ కొత్తగా వృత్తి పన్నును తెర మీదకు తెచ్చింది. టాక్స్ ఫోన్లకు స్పందించని వారికి నోటీస్ లు ఇవ్వటానికి ఆశాఖ సిద్ధమవుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. కాగా సమాచార శాఖ అధికారులు మాత్రం పాత్రికేయులు కు టాక్స్ తో సంబంధం లేదని చెబుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వం మాత్రం పాత్రికేయులకు నెత్తి మీద పిడుగు లాంటి బహుమతే ఇవ్వనుందా అని పాత్రికేయలోకం చర్చించుకుంటోంది.

పేదవాడి ఆరోగ్యానికి సంజీవని సీఎం సహాయనిధి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : పేదవాడి ఆరోగ్యానికి సంజీవనిలా ముఖ్య మంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడు తుందని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. గురువారం గోరం ట్ల వారి కార్యాలయంలో 13 మంది లబ్ది దారు లకు రూ. 21,34,680 లక్షల రూపాయల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆసందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లా డుతూ విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ, పేదవాడి ఆరో గ్య రక్షనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నూతన విధానాలను అవలంబిస్తుందని అన్నారు. నియో జకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సిఫార్సు చేసిన మెడికల్ బిల్లు లను, ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేసి వీలైనంత తొంద రగా వారికి ఆర్థిక సహాయం అం దేలా కృషి చేస్తున్నానని తెలి పారు. రాష్ట్రంలో అనేక మంది పేదల ప్రా ణాలు కాపాడేందుకు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు వారు దాతృత్వం తో కోట్లాది రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా అందిస్తు న్నారని అన్నారు. ధవలేశ్వరం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టుకొమ్మలు పడి మృతి చెందిన పాతూరి అక్కర శ్రీ కుటుం బానికి మూడు లక్షల రూపాయలు, గాయాల పాలైన దేవదాసి నిషితకు రూ. 80 వేల, మంజూరు చేసినందుకు చంద్రన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పా రావు, పుక్కళ్ళ రాజు, అంబటి శ్రీను, దేవల్ల రాం బాబు, వట్టి కూటి దత్తుడు సావాడ శ్రీనివాస్ రెడ్డి, ఆళ్ల ఆనం దరావు, ఎర్రమోతు ధర్మరాజు, బత్తిని ఏడుకొం డలు, నాల రమేష్, దొడ్డి బాబ్జి, సింగ వరపు సత్యనారాయణ, చౌడాడ లాజర్ పాల్గొన్నారు.

పేదవాడికి పటెడన్నం పెట్టడమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - గోపాలపురం : పేదవాడికి పట్టెడు అన్నం పెట్టడం ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే వెంకటరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సముదాయముల ఆవరణ ములో అన్న క్యాంటీన్ను ఎమ్మెల్యే భూమి పూజ చేసి లాంఛనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ అత్యంత వెనుక బడిన నియోజకవర్గంగా ఉన్న గోపాలపురం లో కేవలం రూ. 5కే పేదవాని ఆకలి తీర్చ డానికి రూ రూ. 61 లక్షల వ్యయంతో నిర్మించే ఈ అన్నా క్యాం టీన్ను నాలుగు నెలలలో నిర్మించేందుకు గుత్తేదారు ముందుకొచ్చారని తెలిపారు. ప్రభు త్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు భాగంగా అవసర మైన ప్రతి చోట అన్న క్యాంటీన్ నిర్వ హించి పేదల ఆకలి తీర్చటం తమ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్ర మం లో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మ రాజు, జనసేన పార్టీ నియో జకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగండ్ల సువర్ణ రాజు, బిజెపి మండల పార్టీ అధ్య క్షుడు గల్లా శ్రీని వాస్, ఎంపీడీవో రాజ్ మనో హర్, తహసిల్దార్ సాయిప్రసాద్, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు కొర్లపాటి రాము, గోపాలపురం చెరుకు మిల్లి సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేష్ గద్దె హరి బాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షు రాలు కాకర్ల రామ తులసి, తెదేపా సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం, నీటి సంఘం అధ్యక్షులు రఘురాం, మద్దిపాటి రాజేష్, నూతంగి దొరబాబు, నందమూరి సత్యనారాయణ, జేష్ఠ శ్రీని వాసరావు, జేష శ్రీధర్, బురెడ్డి వాసు పాల్గొన్నారు

స్వామిత్వా సర్వేతో ప్రజలకు హక్కు పత్రాలు మంజూరు

విశాలాంధ్ర - సీతానగరం: స్వామిత్వా సర్వే ఆధారంగా ప్రజలకు హక్కు పత్రాలు మంజూరు చేయడం జరుగుతుంది అని డిఎల్‌పిఓఎమ్ నాగ లత అన్నారు. గురువారం మండలంలోని చినకొండేపూడి గ్రామ పంచాయితీ పరిధిలో జరు గుతున్న స్వమిత్వా సర్వేను ఎంపిడిఒ ఎమ్ భారతి ఆధ్వర్యంలో డిఎల్‌పిఓఎమ్ నాగలత క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేక రులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా గ్రామాల్లో చేపట్టిన స్వమిత్వా సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. మం డల వ్యాప్తంగా నాలుగు బృం దాలు స్వమిత్వా సర్వే చేపడు తున్నారు అని అన్నారు. ప్రస్తు తం రెండో పేజీలో భాగంగా రఘుదేవపురం, రాపాక, చిన కొండేపుడి, మునికూడలి, ములకల్లంక (వెదుళ్లపల్లి), నాగంపల్లి (బీపురుపల్లి), కాట వరం పంచాయతీలో సర్వే జరుగుతుంది అని అన్నారు. ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం గ్రామ ప్రజలకు శాశ్వత హక్కు పత్రాలను మంజూరు చేయడం జరుగుతుంది అని అన్నారు. డాక్యుమెం ట్లు లేని ఇళ్లకు ఇంటి పన్ను రసీదులు ద్వారా హక్కు పత్రాలు మంజూరు చేస్తామన్నారు. సర్వే చేసే సిబ్బంది త్వరితగతిని పూర్తి చేయాలని ఆదే శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, పంచాయితీ కార్యదర్శి టి శ్రీనివాస్, సర్వేయర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి ఆదేశం

విశాలాంధ్ర - కొవ్వూరు : ఒకవైపు వర్షాకాలం, మరోవైపు వరద ఉధృతి కారణంగా సెనుమార్పులు వచ్చి ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవకుండా అధికారుల అప్ర మత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన గురువారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య విభాగం మరింత అప్రమత్తంతో ఉండాలని సూచించారు. మున్సిపాలిటీలో మూలన పడి ఉన్న కాంపాక్టర్ మరమ్మతులకు ఏడు లక్షల అవసరం సమా వేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. పట్టణంలో ఉన్న మూడు జగనన్న కాలనీలకు ట్యాంకర్ల ద్వారా మంచి రేటు సరఫరా చేయడానికి కౌన్సిల్లో నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా కౌన్సిల్ హాల్లో మాజీ చైర్ పర్సన్స్ చిత్రపటములు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సంద ర్భంగా మాజీ చైర్మన్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్, గ్రంధి సందీప్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మణిరామ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర - సీతానగరం: ఊరువాడా భక్తి శ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో 90 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి వినా యక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బిభక్తులు జోరు వానను సైతం లెక్కచేయకుండా మండపాలను ఏర్పా టు చేసి పువ్వులు, కాయలు, మామిడి తోరణాలు, అరటి చెట్లు, ఆకులతో అందంగా అలంకరించారు. మండపాలు, వినాయక ఆలయాల వద్ద భక్తులు బారులు తీరి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా చేసిన వెబ్సైట్ ద్వారా మండపాలు, విగ్రహాలు ఏర్పాటుకు రెవెన్యూ, పోలీస్ శాఖ అనుమతులు మంజూరు చేశారు. దీని ఆధారంగా మండల వ్యాప్తంగా 90 మండపాల్లో వినా యక విగ్రహాలకు అధికారులు మంజూరు చేశారు. దీనిలో విగ్రహాల ఎత్తు 6 అడుగులు మించకూడదు డీజే అధిక ధ్వని లేకుండా అనుమతులను మంజూరు చేశారు. ఈ మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

కాటైనికోనలో

మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాటైనికోన గేటు సెంటర్, సుబ్బా రాయుడు గుడి వద్ద, మావుళ్ళమ్మ గుడి హైస్కూల్ వద్ద వినాయకుడిని ప్రతిష్ట చేశారు. అలాగే చెయ్యేరు, లక్ష్మీ వాడ, పెనుమల్ల, బంటుమిల్లి, ఉప్పూడి, గెద్దనాపల్లి, దొంతి కర్రు, కొప్పిగుంట, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసు తిప్ప, పల్లం, చిరయానం గ్రామాల్లో గణపతి విగ్రహాలను ప్రతి ష్టించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతి పందిళ్లను అందంగా విద్యుత్ దీపాలతో అలంకరిం చారు. తొమ్మిది రోజులు పాటు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చివరి రోజున అన్న సమారాధన, గణపతి ఊరేగింపులు, నిమజ్జనం కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలు వినాయకుని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్లు జారీ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం స్థానిక స్త్రీ శక్తి భవనం నందు మండలంలో ఉన్న అర్హులైన చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్టు వెలుగు ఏపిఎం సన్యాసిరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ షాన్మోహన్ షగిలి ఆదేశాల మేరకు డిఐసి జిల్లా పరిశ్రమల కేంద్రం , డిఆర్‌డిఏ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో ఉన్నటువంటి చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ మరియు ఉద్యం సర్టిఫికెట్‌లు జారి చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఎం కేశవ్, బాబూరావు, మండల ఇంచార్జ్ భరత్, అరుణ్ సందీప్, వివోఏలు పాల్గొన్నారు.

కుండలేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర - కాట్రేనికోన : దక్షిణ కాశీగా పేరుపొందిన కుండలేశ్వరం పుణ్యక్షేత్రంలో కుండలేశ్వరస్వామివారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి ఏ హరి హరినాథ్ శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా కుండలేశ్వరం పుష్కర ఘాట్ వద్ద ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సమక్షంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం మండపం వద్ద ఆయనకు ఆలయ ప్రధాన పూజారి కామేశ్వర రావు వేదాశీర్వచనం అందించగా, ఈఓ దుర్గా తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జివివి సుబ్బలక్ష్మి సత్యనారాయణ, సొసైటీ చైర్ పర్సన్ గంగుమళ్ళ రవి కుమార్, మమ్మిడివరం సీఐ మోహన్ కుమార్, ఎస్ఐ అవినాష్, తహసిల్దార్ సుబ్బలక్ష్మి, గ్రామ కార్యదర్శి దుర్గమ్మ, పలుశాఖలఅధికారులు,సిబ్బంది, గ్రామస్తులున్నారు.

వినాయకుడు విగ్రహాలకు రూ.3లక్షల విరాళం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : కోనపాపేట మత్స్యకార గ్రామాలైన వినాయకుడు విగ్రహాలకు ఉమ్మిడి చిన్న ఆయన సొంత నిధులు మూడు లక్షల రూపాయలు గురువారం విరాళం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. గ్రామాలలో నిర్వహిస్తున్న మండపాలకు మూడు లక్షల రూపాయలు సొంత నిధులు కేటాయించడం ఎంతో అభినందనీయమని మర్రెడ్డి శ్రీనివాస్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు,గ్రామస్తులు,మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖా లైన్‌మెన్ మృతి
- మరొకరి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - పెద్దాపురం : విద్యుత్ మరమ్మత్తుల్లో పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తుండగా ఒక లైన్మెన్ మృతి చెందగా, మరో లైన్మెన్ తీవ్ర గాయాలపాలైన సంఘటన గురువారం పెద్దాపురం పట్టణంలో చోటు చేసుకుంది. సిఐ విజయశంకర్, ఎస్ఐ మౌనిక కథనం ప్రకారం పట్టణంలోని కొండయ్యపేటకు చెందిన ఆరిమిళ్ళి రామకృష్ణ (35), స్థానిక శివాలయం వీధికి చెందిన యాళ్ల చిన్నిబాబు (37) స్థానిక పాశిలివీధిలో విద్యుత్ లైన మరమ్మత్తు చేస్తుండగా విద్యుత్ షార్ట్ కారణంగా రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా చిన్నిబాబు తీవ్ర గాయాల పాలయ్యారు. మృతుడు రామకృష్ణకు తండి, తల్లితో పాటు సోదరి ఎన్నారు. గాయాలైన చిన్నిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దాపురం పట్టణం నల్లవ సచివాలయ పరిధిలో గ్రేట్ యనర్జీ అసిస్టెంట్స్ (జూనియర్ లైన్మెన్)లు గా పనిచేస్తున్నారు. ఘటనలో ఇరువురు లైన్ మెన్లు మృతి చెందడం పట్ల విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చిన్నిబాబు చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 28 శెసిటీ 23 విద్యుద్ఘాతంతో మృతి చెందిన లైన్మెన్ రామకృష్ణ మృతదేహం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌడ వద్దు - శెట్టిబలిజ ముద్దు

- విశాలాంధ్ర వార్తకు స్పందన.
- శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లు ఇస్తామని మంత్రి వాసంశెట్టి హామీ

విశాలాంధ్ర - కాట్రేనికోన : సాంకేతిక లోపంతో కొన్ని రోజులుగా శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లు నిలిచిపోవడంతో ఈనెల 23న విశాలాంధ్ర దినపత్రికలో సాంకేతిక లోపం- శెట్టిబలిజలకు శాపం శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారుల స్పందన వచ్చింది. తాత్కాలికంగా శెట్టి బలిజ కులం సర్టిఫికెట్లు జారీ చేయవద్దని మండల తాసిల్దారులకు కోనసీమ జిల్లా కలెక్టర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇవే ఆదేశాలు జారీ అయ్యాయి. వార్తపై శెట్టిబలిజ సంఘీయుల్లో కదలిక వచ్చి సోమ వారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ గ్రీవె న్స్‌కు శెట్టిబలిజ నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రా లు అందజేశారు. కోనసీమ కేంద్రం అమలాపురం లోనూ శెట్టిబలిజ నాయకులు కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. గౌడ (శెట్టిబలిజ) కులంగా ప్రస్తుతం ఆన్లైన్లో వస్తుండడంతో శెట్టి బలిజ నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇప్పటికీ తాము సాంకేతిక సమస్యగానే పరిగణిస్తున్నామన్నారు. 105 ఏళ్ల నుండి శెట్టిబలిజ కులం సర్టిఫికెట్‌లు జారీ చేస్తున్నట్లుగానే కొనసాగించాలని, తాము ఎవరికి ఉప కులం కాదన్నారు. ఎప్పటిలాగే శెట్టిబలిజ కులం బీసీ బీగా సర్టిఫికెట్లను వెంటనే జారీ చేసి విద్యార్థులు నిరు ద్యో గులకు నష్టం కాకుండా చూడాలని నాయకులు కోరారు. 2023లో గత ప్రభుత్వం జారీ చేసిన తప్పుడు జీవోను వెంటనే రద్దుచేసి ప్రధాన కులం గానే శెట్టిబలిజ కులంను పరిగణించి, బ్రాకెట్లు, తోక లు లేకుండా నేరుగా శెట్టిబలిజ కులంసర్టిఫికెట్లు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఎంతటి ఉద్యమం అయినా చేపట్టి తమ హక్కును కాపాడుకుం టామని శెట్టిబలిజ నాయకులు హెచ్చ రించారు. అలాగే సమస్యను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ దృష్టికి నాయకులు తీసు కువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శెట్టిబలిజ కుల స్తులు అపోహలకు గురి కావద్దని, వదంతులు నమ్మ వద్దని సాంకేతిక లోపంతోనే ఇలా జరిగింది తప్ప ప్రభుత్వ ఉత్తర్వులు కాదన్నారు. ఏడు రోజుల్లోగా సమస్యను పరిష్కరించి ఎప్పటిలాగే శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లను జారీ చేస్తామన్నారు. ఇప్పటికే ఈ సమ స్యను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీసీ వెల్ఫేర్ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లానని మంత్రి సుభాష్ వెల్లడించారు. కోనసీమ శెట్టిబలిజ మహా నాడు అధ్యక్షులు మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, తాలూకా శెట్టి బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాండ్రేగుల సత్య నారాయణ, మున్సిపల్ చైర్పర్సన్ రెడ్డి నాగేంద్ర మణి, సంఘం నాయకులు అనుసూరి పురుషోత్తం, మనోహర్, నాని, చెల్లుబోయిన శ్రీనివాస రావు, కుడిపూడి బాబు, నాగేంద్ర నాయకత్వం వహించారు.

విద్యుత్ అమరవీరుల త్యాగాలతో స్మార్ట్ మీటర్లను తిప్పికొడతాం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : తూరంగి అల్లూరు సీతారామరాజు కాలనీలో స్థానిక యువకులు విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణలను వేగంగా అమలు చేయడం. 2000 సంవత్సరంలో ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేయడం, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్స హించడం, విద్యుత్ చార్జీలు పెంచడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు పెద్ద ఎత్తున ఆరు నెలలు పాటు ఆందోళనలు నిర్వహిం చారు. వామపక్షాలు దీనికి నాయకత్వం వహించాయి. ఆనాడు ప్రతిపక్షాలు ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇతర అనేక సంస్థలు ఈ ఉద్యమంలో కలిసి పోరా డాయి. ఉద్యమంలో పరాకాష్టగా ఆగస్టు 28 చలో హైదరాబాద్ పిలుపులో ప్రజల స్వచ్ఛందంగా హైదరాబాద్ పోరాటంలో పాల్గొన్నారు. టియర్ గ్యాస్, భాష వాయువు ప్రయోగం, తీవ్రమైన లాటీ చార్జ్, తుపాకీ కాల్పుల్లో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డిలు కాల్పుల్లో మరణించారు. వందలాది మందికి గాయాలు అయ్యా యి. ఈ విద్యుత్తు ఉద్యమ తాకిడితో తరువాత జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఓటమి పాలయ్యిందని అజయ్ అన్నారు. నేటి కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగంలో ప్రజలపై అనేక భారాలు వేస్తున్నారు. విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయి. అధాని స్మార్ట్ మీటర్లను బిగించడం ద్వారా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని పెంచడం, ప్రైవేటు సంస్థలు ప్రవేశానికి చంద్రబాబు ప్రభుత్వం మరొకసారి ద్వారాలు తెరిచిందన్నారు. ఇళ్ళకు, షాపులకు బిగిస్తున్న అదానీ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్టా సురేష్, మల్లాడి మణికంఠ, రేగల శ్రీను, కింతాడి నరసింహమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతరజిల్లా చైన్‌స్నాచర్స్ అరెస్టు

విశాలాంధ్ర - ఆజోలు : చెడు వ్యసనాలకు బానిసలైన ఇద్దరు వ్యక్తులు నేర వృత్తి ఎంచుకుని దొంగ తనాలకు పాల్పడుతున్నారని రాజోలు సిఐ టివి నరేష్ కుమార్, అమలాపురం క్రైమ్ సిఐ ఎం గజేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఆరు వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన చైన్‌స్నాచింగ్ దొంగలను కొత్తపేట డిఎస్పీ ఎస్ మురళీ మోహన్ పర్యవేక్షణలో రాజోలు, అమలాపురం పోలీసులు గురువారం శివకోడులో అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.17.30 లక్షల విలువైన 171 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రాజోలు సిఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో వివరాలు వెల్లడించారు. భీమవరానికి చెందిన పాలిశెట్టి పాండు రంగారావు భీమవరంలో టిఫిన్ సెంటర్ నడుపుతు అదే హెటల్లో ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన లంక మురళికృష్ణ పని చేస్తు ఇద్దరు కలిసి పేకాట, క్రికెట్ బెట్టింగ్ లను అలవాటు పడి వ్యాపారంలో వచ్చే సంపాదన పిల్లల చదువులకు, ఇంట్లో జీవనానికి సరిపడక అప్పుల పాలై అప్పుల వాళ్ల వేదింపులు తాలలేక సులభంగా డబ్బు సంపాదించాలని చైన్ స్నాచింగ్, దొంగత నాలు చేయడం మొదలెట్టారు. అంబేద్కర్ కోనసిమ జిల్లాలో రాజోలు పోలిస్ స్టేషన్‌లో 2, రావుల పాలెం, నగరం, మలికిపురం పోలిస్ స్టేషన్లలో ఒక్కొక్కటి, ఏలురు జిల్లా ముదినేపల్లి పోలిస్ స్టేషన్‌లో ఒకటి మొత్తం ఆరు నేరాలకు పాల్పడ్డా రని తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిపై నిఘా పెట్టారు. రాజోలు మండలం శివకోడు వై జంక్షన్ వద్ద వారిద్దరూ సంచరిస్తున్నట్టు రాజోలు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పెట్టుకున్న అమలాపురం క్రైమ్ సిఐ గజేంద్ర కుమార్, ఎస్ఐలు పరదేశి, ఎఎస్సై బాలకృష్ణ, క్రైమ్ కానిస్టేబుల్స్ అర్జున్, సాయి, హరి, ప్రసాద్, రాజోలు సిఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై రాజేష్ కుమార్, క్రైం సిబ్బంది రమణ, రమేష్, కిషోర్, హుస్సేన్‌లను జిల్లా ఎస్పి అభినందించారు.

దుర్గమ్మకు ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పెదపూడి : ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ఎమ్మెల్యే జన్మదినోత్సవం సందర్భంగా విజయవాడ శ్రీ దుర్గమ్మ వారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, కూటమి నేతలు, కార్యకర్తలు, ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతకుమారికి టీడీపీ నేతల అభినందనలు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఆంధ్రప్రదేశ్ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన రెడ్డి అనంతకుమారిను మామిడికుదురు మండలానికి చెందిన పలువురు టీడీపీ సీనియర్ నేతలు అభినందించారు. విజయవాడ తాడిగ డపలోని బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాల యంలో గురువారం రెడ్డి అనంతకుమారి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మామిడికుదురు మండల టీడీపీ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, చుట్టుగుల్ల కిషోర్, బోనం బాబు హాజరై ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని, బీసీ సమాజానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తాను అని రెడ్డి అనంత కుమారి తెలిపారు.

రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ

విశాలాంధ్ర - పిఠాపురం : వార్షిక తనిఖీలలో భాగంగా పిఠా పురం రూరల్ పోలీస్ స్టేషన్‌ను మహేష్ పటేల్ దేవరాజ్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్న కేసుల రికార్డులను కూడా తనిఖీలు నిర్వహించారు. ఆయనతో పాటు పిఠాపురం సిఐ శ్రీనివాస్, పిఠాపురం టౌన్, రూరల్ ఎస్సైలు ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఏలేశ్వరం వాసి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఏలేశ్వరం వాసి సాయి ప్రదీప్ ఎంపిక య్యారు. ఈ మేరకు స్థానిక సాయి శంకర్ నేత్ర వైద్యాల యంలో పట్టణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, నేత్ర వైద్యులు అనుసూరి నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్ విజయ్ బాబు చేతుల మీదుగా గురువారం స్పార్క్ చైర్మన్, గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికైన సాయి ప్రదీప్‌కు చిరు సత్కా రం చేసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థ భారతదేశ వ్యాప్తంగా నిర్వహించిన గూగుల్ స్టూడెంట్ అంబాసీడర్ ప్రోగ్రాంకు తాను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుండి గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికయ్యా నన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల శ్రీనివాస్, అలమండ దుర్గాప్రసాద్, గొల్లపల్లి గణేష్, తండూరి రాము, పూరా రాజుబాబు, కె నాగభూషణ్ స్పార్క్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి గ్రామసభ నివేదిక

విశాలాంధ్ర - పెదపూడి : పెద పూడి గ్రామ పంచాయతీలో సోషల్ ఆడిట్ గ్రామసభ నిర్వహించారు. గురువారం సర్పంచ్ కలవల కృష్ణ మూర్తి అధ్యక్షతన జరిగిన గ్రామసభ లో నివేదిక చదివి వినిపించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మండలంలో నాణ్యమైన రీతి లో సక్రమంగా పనులు జరుగుతున్నాయని అదే విధంగా ఫీల్డ్ వెరిఫికేషన్ ఎంపీడీవోతో పాటు తాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు పుట్ట గంగాధర్ రామారావు చౌదరి, అమ్మన్న చౌదరి, ఏపీవో సత్యనారాయణ, వాసు, సి సత్యనారాయణ, ఈవో ఉషారాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర - కాకినాడ : డా ఏ అరుల్విసగన్, ప్రాజెక్టు డైరెక్టర్, పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియం త్రణ సంస్థ వారు స్థానిక రోటరీ సమా వేశ మందిరములో జిల్లా ఎయిడ్స్ నివారాణ మరియు నియంత్రణ సంస్థ, వారి ఆద్వర్యంలో నిర్వహించబడుతున్న ఏఆర్‌టి కేంద్రము (హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు మందులు ఇచ్చు కేంద్రము) మకరయు కోస్టల్ నెట్వర్క్ ఆఫ్ పాజిటివ్ పీపుల్ (జఫీ ూశ్రీబం) సంస్థ సిబ్బందితో సమన్వయ సమావేశమును నిర్వహించారు. ఈ సమావేశములో డా ఏ అరుల్విసగన్, ప్రాజెక్టు డైరెక్టర్, పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు యానాం జిల్లాలో నివసిస్తున్న సుమారు 140 మంది హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు కాకినాడ ఏఆర్‌టి సెంటర్‌లో మందులు వాడుతూన్నారని వారి సంవరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల గురించి డా ఐ ప్రభాకర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ , టిబి అధికారి, సిబ్బందితో చర్చించారు. ఈ సమావేశములో డా ఐ ప్రభాకర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టిబి అధికారి, పి బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ఏ బుజ్జి బాబు, జిల్లా సూపర్వైజర్, డా పృథ్వీ, వైద్యాధికారి, యానాం, డా రత్నమని, డా శిల్ప, వైద్యాధికారులు, జిజిహెచ్ కాకినాడ, ఎమ్ రామ్ మోహన్, ప్రెసిడెంట్, టిఎన్‌పి ప్లస్, కె చిట్టితల్లి, సిఎన్‌పి ప్లస్, ఏఆర్‌టి సిబ్బంది, పుదుచ్చేరి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కరపలో ఆరడుగుల మట్టి వినాయకుడు

విశాలాంధ్ర - కరప : కరపగ్రామంలో మెరకవీధి రామాలయం గుడివద్ద ఆరడుగుల మట్టి వినాయ కుడు విగ్రహం ఏర్పాటు చేశారు. గ్రామమాజీ సర్పం చ్ పోలిశెట్టి తాతీలు గణేష్ విగ్రహాన్ని బంక మట్టితో తయారు చేశారని, పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు మేలని తెలిపారు. నక్కాసత్తిబాబు, ఆర్‌బి పేపకాయల మాచరావు, పేకేటి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. పెనుగుదురు గ్రామంలో జనసేనపార్టీ మండల అధ్యక్షులు బండారి మురళి ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి నట్టు తెలిపారు. నీటి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి గోవింద రాజులు, మాజీ ఎంపి టిసి తుమ్మలపల్లి మాచరావు, శ్రీను, బాబ్జి, భవాని తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట మృతవీరులకు వామపక్షాల నివాళి

విశాలాంధ్ర - అమలా పురం : ఆగస్టు 28, 2000వ సంవత్సరంలో అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో విద్యుత్ పోరా టాలలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణు వర్ధన్ రెడ్డికి బుధవారం సీపీఐ, సిపిఎం వామపక్షాల ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద సీపీఐ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావుల ఆధ్వర్యం లో వారికి నివాళుల ర్పించి నిరసనలు తెలియ జేశారు. నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలకాలని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 2000వ సంవత్సరం ఆగస్టు

28వ తేదీన కరెంట్ చార్జీల పెంపుదలకు నిరస నగా హైదరాబాద్‌లోని బషీర్ భాగ్‌లో విద్యుత్ ఉద్యమ కారులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి ముగ్గురు మరణానికి చంద్రబాబు నాయుడు కారణమని వారి ప్రాణ త్యాగాలను స్మరించుకుని వారి స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపట్టవలసి వస్తుం దని, పెంచిన ఉద్యుత్ చార్జీలను తగ్గిం చాలని, స్మార్ట్ మీటర్లు బిగించ వద్దని, ట్రూ అప్ చార్జీ లను రద్దుచే యాలని ఆయన అన్నారు. సీపీఎం కన్వీనర్ కారెం. వెంకటేశ్వరరావు మాట్లా డుతూ విద్యుత్ చార్జీలను తగ్గిం చాలని లేని యెడల పెద్దఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ నాయ కులు గుడాల వెంకట రమణ, చెల్లుబోయిన తాతా రావు, పుల్లెల ఆనంద్, సరేళ్ళ శివ, చిట్టిబాబు, సిపిఎం నాయకులు దురా ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సహకరించాలి

రెవెన్యూ అధికారి వెంకట్రావు

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియలకు సహాయ, సహకారాలను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకట్రావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల కమీషన్ సూచనల మేరకు జిల్లాలో చేపడుతున్న ఓటర్ జాబితా కార్యక్ర మాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన, ఫారం-6, 7, 8 పరిష్కా రం, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలను వివరిం చారు. ఈ కార్యక్రమాలు జిల్లాలో సజావుగా సాగేం దుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1000 నుండి 1200 మంది ఉన్న పోలింగ్ స్టేషన్లు 443, 1200 మంది పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను 423 ఉన్నా యన్నారు. వీటిలో సుమారు 400 స్టేషన్లను ఓటర్ల సౌలభ్యాన్ని పరిగణలోకి తీసుకుని పునర్వ్యవస్థీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే పోలింగ్ నిర్వహణకు అనువుగాలేని కేంద్రాలను అనువైన మరో భవనాలకు మార్పుకు ప్రతిపాదిస్తామన్నారు. హేతుబద్ధీకరణ ప్రకారం జిల్లాలో కొత్తగా 183 పోలింగ్ కేంద్రాలు రానున్నాయని, ప్రస్తుతం జిల్లా లోని 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,40,278 మంది ఓటర్లుగా నమోదైయున్నారని ఆయన తెలి పారు. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి ఎన్నికల కమీషన్ నిర్ధేశించిన బిఎల్ఏ-2 ఫారమ్ లో వివరాలను తెలియజేయాలని డీఆర్వో కోరారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబా (టిడిపి), రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ సిపి), ఎవివి సత్యన్నా రాయణ (జనసేన)బి సిహెచ్ రమేష్ బాబు (బిజెపి), సబ్బారావు అప్పారావు (బిఎస్పి), పి శ్రీనివాసు (ఐఎన్‌సీ), తోకల వరదరాజు నంబి (ఆప్) పలివెల వీరబాబు (సీపీఎం) ఎన్నికల విభాగ పర్యవేక్షకులు ఎం జగన్నాధం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పెదపూడి : మండలం లోని పెద్దాడ అనాధ ఆశ్రమంలో కైకవోలు గ్రామానికి చెందిన గ్రామ కూటమి నాయ కులు ఆధ్వర్యంలో అనాధ పిల్లల చేత కేకు కటింగ్ చేసి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు దాసి సురేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకో వాలని, అనపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు వెళ్లాలని,అనాధ ఆశ్రమానికి ఏ అవసరమైన ఎమ్మెల్యే తరుపున మేము సహాయ సహకా రాలు అందిస్తామని దాసి సురేంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో దాసి సురేంద్ర, తుమ్మలపల్లి శ్రీనివాస్, వింత రవికుమార్, రంప మధుబాబు, పినమల వరప్రసాద్, సిద్ధాంతపు ధర్మ తేజ, టానిక్ రాజు, దుర్గాప్రసాద్, పెరుగుల అనిల్ కుమార్, వేలుసూరి అభిరామ్, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్దిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు స్వామివారి వసంత మండపంలో కళ్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ సన్నిధిలో నూతనం గా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మా ణానికి ఆత్రేయపురం మండలంలో వసంతవాడ (అమెరికా) వాస్తవ్యులు కాకర్లపూడి అజయ్ కుమార్, షర్మిల, చి.స్కంధవి వారి కుటుంబ సభ్యులు రూ. 1,00, 000లు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ అర్చ కులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు.

దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

రూ. 6,30,000 విలువ చేసే సొత్తు స్వాధీనం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ధర్మ వరం గ్రామంలో ఈ నెల 21వ తేదీన గాలి తలు పులయ్య ఇంటిలో జరిగిన పట్టపగలు చోరీకి వారం రోజులు వ్యవధిలో జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదే శాలకోసం ప్రత్తిపాడు పోలీసులు చేధించారు. పాదాలమ్మ గుడి వద్ద అనుమానంగా తిరుగు తున్న ఇద్దరు వ్యక్తులను ప్రత్తిపాడు సర్కిల్ పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. సర్కిల్ ఇన్స్పె క్టర్ బివిస్ అప్పారావు సూచనల మేరకు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం విచారణ చేపట్టారు. ధర్మవరం గ్రామం లో ఇంటిలో చోరీకి పాల్పడిన ముద్దాయిలుగా గుర్తించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు మాట్లాడుతూ చోరీకి పాల్పడిన ముద్దాయిలు రాజ మండ్రి ప్రాంతానికి చెందిన కొవ్వూరి సునీల్, మోర్త దీవెనరాజులని గుర్తించి వారి వద్దనుండి 247 గ్రాముల బంగారం, 90 గ్రాముల వెండి,3 గ్రాముల ప్లాటినం ఉంగరం, ఒక యమహా ఆర్ 15 బైక్ స్వాధీనం చేసు కున్నారు. చోరీ సొత్తు విలువ 6 లక్షల 30వేలు అని పెద్దా పురం డిఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు. త్వరితగతిన కేసు చేధించిన సీఐ, ఎస్సై లతో పాటు క్రైమ్ పార్టీ హెడ్ కాని స్టేబుల్ ఎస్ వెం కటరమణ, సిబ్బంది గోవింద్ బాబు, కె గోవిం ద్, శివ రామకృష్ణ, ఎన్ త్రిమూర్తులు, నాగేశ్వ రరావులని డీఎస్పీ శ్రీహరి రాజు అభినందించారు.



ప్రకటన
డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం,
బోడసకుర్రు పంచాయితీ పరిధిలోని బోడసకుర్రుపాలెం, డోర్ నెం. 1-119 నకు చెందిన
మట్టపర్తి సింహాద్రి (లేటు), మట్టపర్తి సీతాధనలక్ష్మి వారి
మనవడు మట్టపర్తి మోహన శ్రీనివాసరావు
ఇచ్చిన పత్రిక ప్రకటన.
మా నాన్నమ్మగారైన మట్టపర్తి సీతాధనలక్ష్మి గారు
ది. 17-01-2016న బోడసకుర్రుపాలెం గ్రామంలో మా ఇంటి వద్ద మరణించారు.
వారి మరణం బోడసకుర్రు గ్రామ పంచాయితీ నందు నమోదు కాలేదు.
ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల 10 రోజుల్లో తెలియజేయగలరు.
మట్టపర్తి మోహన శ్రీనివాసరావు, తండ్రి: ఏసు వెంకట సుబ్బారావు (లేటు)
బోడసకుర్రుపాలెం, అల్లవరం మండలం, డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సెల్: 7995704361

విన్సెంటన్‌ను పరామర్శించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర - అమలాపురం : రాజమహేంద్ర వరం మోరాంపూడి శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థుల చేతుల్లో ర్యాగింగ్ గురై తీవ్రంగా గాయపడి రాజోలు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుబ్బం విన్సెంటన్ ప్రసాద్‌ను గురువారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్‌తో పాటుగా పలువురు సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ మేరకు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఒక మైనర్ విద్యార్థి విన్సెంటన్ ప్రసాద్‌ను తోటి విద్యార్థులు అనాగరికంగా ఇస్త్రీ పెట్టెతో కాల్చి తీవ్రంగా గాయపరచడం చాలా దుర్మార్గమైన సంస్కృతిని శ్రీ చైతన్య విద్యా సంస్థలు పెంచి పోసిస్తున్నాయన్నారు. తీవ్రంగా గాయపడ్డ విద్యార్థి విన్సెంటన్ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియకుండా దాచిన మోరాంపూడి శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. విన్సెంటన్ పై దాడిచేసిన విద్యార్థులతో పాటుగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ పై వార్డెన్ పై కూడా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయ్యాలని ఈ సందర్భంగా దేవ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. దేవ రాజేంద్ర ప్రసాద్‌తో పాటుగా పుల్లెళ్ళ ఆనంద్, సీపీఐ రాజోలు నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెల్లుబోయిన తాతా రావు, సరేళ్ళ శివ, వి చిట్టిబాబు ఉన్నారు.

అక్షరాస్యతే లక్ష్యంగా అక్షరాంధ్ర

విశాలాంధ్ర - కరప : ప్రభుత్వం ప్రవేశపెట్టిన అక్ష రాంధ్ర కార్యక్రమంలో భాగంగా 100% అక్షరాస్యతను సాధించేందుకు 190మంది విద్యా వాలంటీర్లను వెలుగు, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది ద్వారా గుర్తించి ఈనెల 29, 30 తేదీలలో చంద్రన్న సమావేశ మందిర ములో శిక్షణ అందించేందుకు ఉదయం 10 గంటలకు హాజరవుతారని ఎంపీడీవో ఎం అనుపమ పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నరసాపురం : పేదలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. గురువారం మండలంలో తూర్పు తాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తొలుత పీహెచ్సీలోని మందులు, ల్యాబ్, స్టాఫ్ రూమును, పలు విభాగాలను తనిఖీ చేశారు. ఓపి రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టి పరిశీలించారు. హాస్పటల్‌కు వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఇక్కడ మీకు వైద్య సేవలు బాగున్నాయా సదుపాయాలు ఎలా ఉన్నాయి. డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా, మీకు అవసరమైన మందులు ఇస్తున్నారా అని పలు విషయాలను అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వైద్యం కొరకు వచ్చే ప్రజలతో మర్యాదగా మెలగాలని వారికి ఉత్తమమైన సేవ లను అందించాలని అన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించ డంలో ఎటువంటి అలసత్వము వహించకుండా పనిచేయా లని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంలో సి.హెచ్.ఓ కె.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్, తహసిల్దార్ ఐవివి సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్, స్టాఫ్ నర్స్, ఎం ఎల్ హెచ్పి, తదితరులు పాల్గొన్నారు.

శభాష్ ఏలూరుజిల్లా కలెక్టర్

- వరద సహాయ చర్యల పనితీరు భేష్
- కలెక్టర్‌కు వరద బాధితులు సెల్యూట్

విశాలాంధ్ర - కుక్కునూరు : ఆమె మెరుపువేగంతో దూసుకెళ్తుంది. పనిలో రాకెట్‌లా పని చేస్తుంది. నిజాయితీ, నిబద్ధతతో ముందుకెళ్తుంది. ఎటువంటి విపత్తునైనా సమర్ధవంతంగా ఎదుర్కొంటుంది. ప్రజలు, పాలకులు, ప్రభుత్వం నుంచి మన్ననలు పొందుతుంది. జిల్లాలోనే అంబాసిడర్ గా తనకు మార్క్ వేసుకుంది..ఆ అధికారి ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి. ఇటు ప్రభుత్వం అటు అధికారులకు ఏటా ఏజెన్సీ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వచ్చే వరద విపత్తును ఎదుర్కొనడం సవాల్‌గా ఉంటుంది. ఎటువంటి ఇబ్బంది కలగకుండా వరద బాధితులను సురక్షితంగా తరలించి అన్నివసతులు కల్పించాలి. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడం, పర్యటించడం, బాగోగులు చూసుకోవడంలో అధికారులు కంటి మీద కునుకు,తీరక లేకుండా చేతుల నిండా పని చేయాలి. వరదల్లో అధికారులు విధుల పట్ల కత్తి మీద సాములా వ్యవహరించాలి. ప్రధానంగా ముంపు ప్రాంతాల్లో ఒక్క వరద బాధితునికి ఎటువంటి సమస్య తలెత్తకుండా , ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా సురక్షిత ప్రాంతానికి తరలిచడమే ధ్యేయంగా ముందుకు సాగాలి. పోలవరం ముంపు మండలాలు కుక్కునూరు, వేలేరుపాడులో కొనసాగిన గోదావరి వరదల్లో బాధితుల పట్ల జిల్లా అధికార యంత్రాంగం కసిగా పని చేసింది. విధి నిర్వహణలో తనదైన శైలిలో, ప్రజలే పరమావధిగా భావించి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిండు గోదావరిలో ముంపు గ్రామాలను సందర్శించి ప్రతి ఒక్కరితో శభాష్ అనిపించుకున్న ఆ అధికారి ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి.

పకడ్బందీగా చర్యలు : వారం క్రితం భారీగా కురిసిన వర్షాలు, మహారాష్ట్ర వరదతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.పలు గ్రామాలను వరద చుట్టుముట్టింది.ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ముంపు ప్రాంతాల్లో పకడ్బందీగా చర్యలు చేపట్టారు. లాంచీల్లో, రహదారులు లేని మార్గంలో కాలినడకన వెళ్లి వరద బాధితులను పరామర్శించారు. అధైర్యపడొద్దని కొండంత భరోసా ఇచ్చి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ధైర్యమిచ్చారు.

వినాయక నిమజ్జనాలకు అన్ని భద్రతా చర్యలు తీసుకున్నాం : డీఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : వినాయక చవితి పండుగ నేపథ్యంలో విగ్రహ నిమజ్జన కార్యక్రమాల సమయం లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఏలూరు డీఎస్పి డి.శ్రావణకుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు కొన్ని ముఖ్యమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తిగా శాంతియుతంగా, గందరగోళం లేకుండా నిర్వహించాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఊరేగింపుకు ప్రత్యేక మార్గాలు ఉపయోగించి వాహన రాకపోకలకు ఆటంకం కలగకుండా చూసి పోలీసులకు సహకరించాలన్నారు. శబ్ద కాలుష్యం తగ్గించి, హై డెసిబెల్ సౌండ్ సిస్టమ్స్, డీజే మ్యూజిక్ వినియోగాన్ని పరిమితం చేయాలని, శబ్ద కాలుష్య నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఎత్తైన విగ్రహాలు తరలించే సమయాలలో విద్యుత్ తీగలకు తగలకుండా తగిన జాగ్రత్తలను తీసుకుంటూ విద్యుత్ షాకులకు గురికాకుండా ఉండాలని సూచించారు. నదులు, చెరువుల్లో నిమజ్జనం చేసే సమయంలో ప్రతి ఒక్కరు స్వీయ రక్షణ పాటిస్తూ ఆనందంగా విగ్రహ నిమగ్న కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు. పోలీసుల సహకారం, ఇబ్బందులు తలెత్తినప్పుడు తక్షణమే దగ్గర్లో ఉన్న పోలీస్ అధికారులను సంప్రదించాలని, లేనిపక్షంలో డయల్ 112కు సమాచారం అందించాలని డీఎస్పీ శ్రావణ్ కుమార్ కోరారు.

గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ



విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : బంగాళాఖాతంలో అల్పపీడనం - వాయుగుండం ప్రభావంతో వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలు, మరోవైపు గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు సంబంధిత అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పునరావాసం, రక్షణ చర్యలు చేపట్టాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో గణేశ్ మండపాల నిర్వాహకులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో వరద ప్రభావిత మండలాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. జల వనరులు, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య శాఖలతో సమన్వయం చేస్తూ సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800-233-1077, 94910 414 19 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ ౦91 96181 94377, ౦91 98855 19299 కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీ పుట్టా మహేష్ స్పష్టం చేశారు.

పురోగతి దిశగా "భారత్ తైవాన్" దేశాలు

- నేషనల్ సన్ యాట్-సెన్ జీజియూ కలయికతో విద్యార్థులకు మరింత మేలు
- జీజియూలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు
- టీఈసీసీ డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ షు-చిహ్ హ్సు

విశాలాంధ్ర - రాజానగరం : ఎగుమతి,దిగుమతి రంగాలలో పురోగతి దిశగా భారత్ తైవాన్ దేశాలు పయనిస్తున్నాయని తైవాన్ దేశంలోని టీఈసీసీ డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ షు-చిహ్ హ్సు అన్నారు. మండలంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజియూ) నందు వర్సిటీ ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన గ్రీన్ ఎకానమీ, సస్టైనబుల్ డెవలప్ మెంట్ గోల్స్, గ్రీన్ టెక్నాలజీలలో కృత్రిమ మేధ అంశాలపై రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు గురువారం ఘనంగా ప్రారంభించారు.సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వివిధ ముఖ్యమైన రంగాలలో భారత్%-%తైవాన్ సంయుక్త సహకారం కొత్త ముందడుగులు వేస్తుందన్నారు.ఇరు దేశాలు ఆర్థిక, సాంకేతిక, రాజకీయ రంగాలలో బలమైన సంబంధాలను కలిగి ఉన్నాయని పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్ నైపుణ్యం కలిగి ఉంటే, సెమీకండక్టర్ తయారీలో తైవాన్ ప్రత్యేక అనుభవాన్ని కలిగి ఉందని వివరించారు.ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ హబ్ ను భారత ప్రభుత్వం ఆమోదించిందని, దాని అభివృద్ధిలో తైవాన్ సహకరిస్తుందన్నారు. ఈ రంగంలో జీజియూ అధ్యాప కులు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.తైవాన్‌లోని 12కి పైగా అగ్ర శ్రేణి విశ్వవిద్యాలయాల నిపుణులు, భారతీయ విద్యా వేత్తలతో కలిసి ఈ సదస్సులో పాల్గొనడం విశేషమని కొనియాడారు. జీజియూ ఛాన్సలర్ కె.వి.వి. సత్యనారా యణ రాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ, పర్యావరణ సుకూల ఉత్పత్తులు, సస్టైనబుల్ ఇండస్ట్రియల్ ప్రాక్టీసులు రూపకల్పనలో కృత్రిమ మేధ ముఖ్యపాత్ర పోషిస్తోందని చెప్పారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత గ్రీన్ టెక్నాలజీలు ప్రకృతిని రక్షించి సస్టైనబుల్ భవిష్యత్తుకు దారి చూపుతాయని ఆకాంక్షించారు. అంతర్జాతీయ వేదిక ద్వారా భారతదేశ-తైవాన్ దేశాల గ్లోబల్ నిపుణులు, ఇన్నోవేటర్లు, లీడర్లు ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషకరమని తెలిపారు. ప్రో-చాన్సలర్ కె.శశి కిరణ్ వర్మ విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని, తైవాన్ అకాడమిక్, ఇండస్ట్రీ మద్దతును తమ భవిష్యత్ కెరీర్‌లకు ఉపయోగించుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఐసిఏఆర్ సిటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషు మాధవ్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఎస్డిజిఎస్ సాధన కోసం ఐసిఏఆర్ చేపడుతున్న పథకాలను వివరించారు.అనంతరం ఇరు వర్సిటీ అధికారులు ఎంవోయు పత్రాలపై అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశారు. కార్యక్రమంలో టీఈసీసీ ఇండియా ప్రతినిధి ప్రొఫెసర్ లంగ్-జీహ్ యాంగ్,జీజియూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యు.చంద్రశేఖర్,ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.వి.బి.రాజు,రిజిస్ట్రార్ డాక్టర్ పి.ఎం.ఎం.ఎస్.శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, పరిశో ధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జేసీ తనిఖీ



విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కలెక్టోరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రెవెన్యూ, ఎన్నికలు, పోలీస్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల)లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.